


శ్రీకాకుళంలో షిర్డీ సాయిని దర్శించుకుంటున్న భక్తులు



బొందిలీపురంలో వేషధారణలు, కలశాలతో ఊరేగింపు..

వేడుకగా.. గురుపౌర్ణమి

గురుపౌర్ణమిని పురస్కరించుకుని జిల్లాలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది. ఆదివారం షిరిడీ సాయి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బొందిలిపురంలోని షిరిడీ దర్బార్ ఆలయంలో భక్తులు బారులుదీరారు. సంగీత విభావరి, విచిత్ర వేషధారణలు.. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మొండేటివారి వీధి, విశాఖ బి కాలనీలోని షిర్డీసాయి బాబా ఆలయాలు, బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనం మందిరం, కలెక్టర్ బంగ్లా వద్ద షిరిడి సాయి మందిరం, తదితర ఆలయాల్లో పూజలు చేశారు. - శ్రీకాకుళం కల్చరల్



శాకంబరీదేవిగా శివదుర్గమ్మ

టెక్కలి పరిధి భవానీనగర్‌లోని శివదుర్గ మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకుని ఆదివారం వివిధ రకాల కూరగాయలతో దుర్గమ్మను అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి.. దుర్గమ్మకు పూజలు చేశారు. - టెక్కలి



ఎల్.ఎన్.పేట : 7ఎల్ కాలువకు గండి పడడంతో నీటమునిగిన పంట పొలాలు

ఇంకా నీటిలోనే..

- భారీ వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో రైతులు

ఎల్.ఎన్.పేట/ సరుబుజ్జిలి/ ఎచ్చెర్ల, జూలై 21: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడురోజులు భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం వాతావరణం కాస్త తెరిపినిచ్చింది. కాగా.. వంశధార నది పరీవాహక ప్రాంతంలోని లోతట్టు పంట పొలాలు ఇంకా వరద నీటితో నిండి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే తమకు నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

7ఎల్ కాలువకు గండి

ఎల్.ఎన్.పేట మండలంలో రావిచెంద్రి, కోవిలాం గ్రామాల మధ్య.. వంశధార నదికి అనుసంధానంగా ఉన్న 7ఎల్ కాలువకు గండి పడింది. దీంతో ఈ రెండు గ్రామాల పరిధిలోని సుమారు 60 ఎకరాల్లో వరి ఎదలు నీట మునిగాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఏటా తమకు ముంపు నష్టం తప్పడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఏటా వర్షాకాలంలో వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి వచ్చిన నీటిని 7ఎల్ కాలువకు విడిచిపెడతారు. దీనికితోడు వర్షాలు విస్తారంగా కురిస్తే.. కాలువకు గండి పడుతోంది. ఈ గండిని పూడ్చకపోతే పంటలు పూర్తిగా నష్టపోవాల్సిందే'నని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండి పూడ్చి.. పంటలకు నష్టం జరగకుండా చర్యలు చేపడతామని వంశధార ఏఈ(హిరమండలం సెక్షన్) ఎస్.దిలీప్ తెలిపారు. ప్రస్తుతం వంశధార కుడి ప్రధాన కాలువ గుండా 7ఎల్ కాలువకు నీటి విడుదలను నిలిపేశామన్నారు.

తెగిన మట్టిగట్టు.. రహదారిపై వరద

ఎల్.ఎన్.పేట మండలం కోవిలాం కాలనీ సమీపంలో మళ్లీ భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. మూడురోజులుగా కురిసిన వర్షాల ప్రభావంతో.. కాలనీలోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో.. శనివారం అధికారులు రోడ్డుపక్కన మట్టి గట్టు వేయించారు. కాగా.. కొండవాగుల నుంచి వచ్చే నీటి ఉధృతికి ఈ గట్టు ఆదివారం కొట్టుకుపోయింది. దీంతో ఆదివారం అలికాం-బత్తిలి రోడ్డు మీదుగా వరదనీరు ప్రవహించి.. కోవిలాం కాలనీలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అలికాం-బత్తిలి రోడ్డులో కొట్టుకుపోయిన గట్టు

- సరుబుజ్జిలి మండలంలో వేలాది ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. ఆదివారం ఉదయానికి కూడా పొలాలు చెరువులను తలపించాయి. శాస్త్రులపేట వద్ద పంట పొలాల్లో భారీగా వరదనీరు నిలిచిపోయింది. సరుబుజ్జిలి, కొమనాపల్లి ప్రధాన రహదారి మధ్య లో లెవెల్ వంతెన వద్ద రహదారిపై వరదనీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొట్టుకుపోయిన బోట్లు, వలలు

ఎచ్చెర్ల మండలంలోని బడివానిపేట, బుగట్లపాలేం తీర ప్రాంత గ్రామాల్లో బోట్లు, వలలు కొట్టుకుపోయాయి. తుపాను వలన బోట్లు, వలలు లంగర్లు వేసి సముద్ర తీరంలో మత్స్యకారులు ఉంచారు. అలల ఉధృతికి ఈ రెండు గ్రామాల్లో ఐదు బోట్లు, వలలు కొట్టుకుపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.



సరుబుజ్జిలి: శాస్త్రులపేటలో లోలెవెల్ వంతెన వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



సిక్కోలు వేదన.. సమస్యలపై ప్రస్తావన!

వంద రోజుల్లో వ్యవస్థలను సరిచేస్తా



జిల్లావాసులు ఉపాధి కోసం అధికంగా వలసలు పోతున్నారు. గత ప్రభుత్వం ఉపాధి కల్పించేందుకు కనీసం పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం చేశారు. చాలా ప్రభుత్వ శాఖలకు తాళాలు వేసేశారు. వంద రోజుల్లో ఆ వ్యవస్థలన్నీ గాడిలో పెడతా. జిల్లాలో అపారమైన మత్స్య సంపద ఉన్నా.. మత్స్యకారులు వేట కోసం గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలకు పోతున్నారు. మత్స్యకారులకు ఉపయోగపడే జెట్టీలు, హార్బర్‌లు, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణానికి ప్రణాళికలు చేపట్టాం. ప్రతిసమస్యపై అధ్యయనం చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం.

- కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- ప్రజల ఇబ్బందులే అజెండాగా చర్చించేందుకు నేతలు సన్నద్ధం
- అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లా అభివృద్ధి కుంటుపడింది. అన్ని రంగాలూ నిర్వీర్యమయ్యాయి. ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయి. ప్రాజెక్టులు, పరిశ్రమలు సైతం పడకేశాయి. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలకు పరిష్కారం చూపుతుందని జిల్లావాసులు ఆశతో ఉన్నారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాలు వేదికగా జిల్లాలోని వివిధ సమస్యలపై ప్రస్తావించేందుకు నేతలు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటికి పరిష్కార మార్గం చూపేలా చర్యలు చేపట్టనున్నారు.

పంచాయతీల విలీనంపై..



శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఏడు పంచాయతీల విలీనం ప్రక్రియ సరిగ్గా జరగక.. ఉపాధి పనులకు ఆస్కారం లేకుండా పోయింది. విలీన ప్రక్రియను పునఃపరిశీలన చేసేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. కేఆర్ స్టేడియం, ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి బకాయిలు విడుదల చేయాలని కోరుతాను. వంశధార, నాగావళి నదులు గార, శ్రీకాకుళం మండలాల్లో దిశలు మారిపోవడంతో సముద్రం వద్దకు వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. దీనిపై ప్రస్తావిస్తాను.

- గొండు శంకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే

ఐటీడీఏ ఏర్పాటు చేయాలని..



జిల్లాల విభజన నేపథ్యంలో సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. మెళియాపుట్టిలో ఐటీడీఏ నెలకొల్పాలని కోరుతున్నా. ఎల్.ఎన్.పేటలో పోలీసుస్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. పాతపట్నం నియోజకవర్గం నుంచి ఉద్దానం ప్రాజెక్టుకు నీరువెళ్తోంది. కానీ మా నియోజకవర్గానికి తాగునీరులేదు. యువతకు ఉపాధి కల్పనపై ప్రస్తావిస్తాను. ఇసుక, గ్రానైట్ ఇతరప్రాంతాలకు తరలిపోకుండా చర్యలు చేపడతాం.

- ఎం.గోవిందరావు, పాతపట్నం ఎమ్మెల్యే

జగన్ అక్రమాలపై..



ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో గత వైసీపీ అక్రమాలపై శ్వేతపత్రాలను విడుదల చేస్తుంది. దీనిపై జిల్లాకు సంబంధించి జగన్ సర్కారు చేసిన అక్రమాలు.. ఇతరత్రావాటిని పరిశీలించి ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రస్తావిస్తాను.

- కూన రవికుమార్, ఆమదాలవలస ఎమ్మెల్యే

స్థానికులకు ఉద్యోగాలివ్వాలని..



ఎచ్చెర్ల నియోజకవర్గంలో అధికంగా పరిశ్రమలు ఉన్నా.. స్థానికులకు మాత్రం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. కల్పించడంలేదు. ఈ విషయమై అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. సాగునీరు, తాగునీరు ప్రాజెక్టులకు సంబంధించి సకాలంలో తీసుకోవాల్సిన అంశాలపై కూడా ప్రస్తావిస్తాను.

- నడుకుదిటి ఈశ్వరరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

బెంతుఒరియాలపై..



నియోజకవర్గంలో చాన్నాళ్ల నుంచి బెంతు ఒరియాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యను ప్రధానంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. జల్‌జీవన్ మిషన్ పనులు నియోజకవర్గంలో 10 శాతం కూడా పూర్తికాలేదు. సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఈ పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపడతాం.

- బెందాళం అశోక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

కాలువల ఆధునికీకరణపై..



వంశధార కాలువలు ఆధునికీకరణ చేపట్టాలని కోరుతాను. కరకట్ట పనులన్నింటినీ పూర్తిచేయాల్సి ఉంది. తాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కరించేందుకు పలు విషయాలను ప్రస్తావిస్తా. మరో ముఖ్యమైన అంశాన్ని అసెంబ్లీలో వెల్లడిస్తాను.

- బగ్గు రమణమూర్తి, నరసన్నపేట ఎమ్మెల్యే

వైద్యులను నియమించాలని..



పలాసలో కిడ్నీరీసెర్చ్ సెంటర్‌లో గత ప్రభుత్వం వైద్యులను నియమించలేదు. వాస్తవంగా డయాలసిస్ కేంద్రంగా ఉంది. ప్రత్యేకంగా నెఫ్రాలజిస్టులను నియమించాలని కోరుతా. పెండింగ్‌లో ఉన్న ఆర్వోబీ పూర్తిచేయాల్సి ఉంది. రూ.20 కోట్లతో హిరమండలం నుంచి పలాస నియోజకవర్గానికి తాగునీటి సౌకర్యం కల్పించే ప్రాజెక్టు విషయమై, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే



గుజరాతీపేట: టాలెంట్ పరీక్షకు హాజరైన నిరుద్యోగ యువత

ఎర్రన్న విద్యాసంకల్పానికి అపూర్వ స్పందన

- 650 మంది నిరుద్యోగ యువత హాజరు

గుజరాతీపేట/పలాస/టెక్కలి, జూలై 21: పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్షలకు నిరుద్యోగ యువత నుంచి అపూర్వ స్పందన వచ్చింది. శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మాక్ పోటీ పరీక్షకు 650మంది యువతీ యువకులు హాజరయ్యారు. శ్రీకాకుళం నగరంలోని విద్యాధరి, టెక్కలిలో విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలు, పలాసలోని మదర్ థెరిసా పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు తన తండ్రి ఎర్రన్నాయుడు కృషి చేశారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఉన్నత విద్య నభ్యసించిన నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు వీలుగా ఈ పరీక్షలను ముందస్తుగా నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది జూన్ 10న కోటబొమ్మాళిలో దీనిని ప్రారంభించామని, ఈ ఏడాది కూడా నిర్వహించామని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్-1, 2 పోలీసు నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు ఈ పరీక్ష ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వజ్జ భవానీ, టెక్కలి కళాశాల ప్రిన్సిపాల్ పినకాన జోగారావు పాల్గొన్నారు.

డెంగ్యూతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



విఘ్నేష్ (ఫైల్)

ఇచ్ఛాపురం, జూలై 21: ఇచ్ఛాపురంలోని దానంపేటకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి తిప్పన విఘ్నేష్(21) డెంగ్యూ జర్వంతో ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాజీ సైనిక ఉద్యోగి రమణయ్యరెడ్డి కుమారుడు విఘ్నేష్.. వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామమైన దానంపేట వచ్చాడు. జ్వరం రావడంతో మందులు వాడాడు. అయినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూగా నిర్ధారించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు రమణయ్యరెడ్డి, రాణి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

సురవరంలో చోరీ..

జలుమూరు, జూలై 21: సురవరంలో సురవరపు శివప్రసాద్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. సురవరపు ప్రభావతికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో, చిన్న కుమారుడు శివప్రసాద్ శ్రీకాకుళంలో ఉంటున్నారు. ప్రభావతి సురవరంలో ఉంటోంది. ఇటీవల ఆమె ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో కుమారుడి వద్దకు వెళ్లింది. చిన్నకుమారుడు శివప్రసాద్ ఆదివారం ఇంటికి వచ్చి చూడగా లోపలి తలుపులు తెరచి ఉండి బీరువాలోని లాకర్ లేనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. తన ఇంట్లోని లాకర్‌లో రూ.9లక్షలు, వెండి పళ్లెం, ఇతర వస్తువులు దొంగలు అపహరించారని ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. నరసన్నపేట సీఐ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, క్లూస్ టీం పరిశీలించారు.



విదేశీ పక్షులు వచ్చేశాయ్..



సైబేరియా దేశం నుంచి ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి విదేశీ పక్షులు వచ్చేశాయి. ఏటా జూలై నెలాఖరులో విదేశీ పక్షులు సంతానోత్పత్తి కోసం వందలాది మైళ్లు దాటి ఇక్కడకు చేరుకుని విడిది చేస్తాయి. ఇక్కడ జలసంరక్షణ, సమశీతోష్ణ పరిస్థితులు వాటికి అనుకూలంగా ఉంటాయి. ప్రధానంగా శ్రీరామచెరువు, ఊరచెరువులో నీటి లభ్యతతోపాటు పక్షులకు ఆహారమైన చేపలు అందుబాటులో ఉంటాయి. గ్రామస్థులు ఈ చెరువులను సంరక్షిస్తూ.. ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఈ చెరువు గట్ల సమీపంలో చెట్లపై విదేశీ పక్షులు విడిది చేస్తాయి. ఇక్కడ సంతానోత్పత్తి అనంతరం కొన్ని నెలలు గడిపి.. వాటి పిల్లలతో కలిసి సైబీరియా వెళ్లిపోతాయి. కాగా.. ఈ పక్షులు ఇక్కడకు రావడం తమ అదృష్టమని తేలుకుంచి గ్రామస్థులు తెలిపారు. ఇవి ఇక్కడ సంతానోత్పత్తి చేస్తాయి కాబట్టి.. విదేశీ పక్షులు కావని.. పేర్కొంటున్నారు. వేసవిలో ఇక్కడ వేడిని తట్టుకోలేక సైబీరియా తీరానికి వలస వెళ్తుంటాయని.. మళ్లీ వర్షాలు కురిసే సమయానికి తమ గ్రామానికి చేరుకుంటాయని చెబుతున్నారు. - ఇచ్ఛాపురం

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023



బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలిముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బీఎన్ఎస్ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.

కళతప్పిన కృష్ణపట్నం

- అదానీ స్వార్థం, కాకాణి దందాలకు బలి
- కంటైనర్ కార్గో నిలిపివేతతో తీరని నష్టం
- రోడ్డునపడ్డ వేలాదిమంది ఉద్యోగులు
- ఎగుమతుల్లేక సాగు ఉత్పత్తుల ధర పతనం
- గ్రానెట్ పరిశ్రమపైనా పెనుభారం

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టు.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార కేంద్రం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కేంద్రం. మూడేళ్ల క్రితం వరకు దేశంలోనే పెద్ద కంటైనర్ కార్గో కేంద్రంగా గుర్తింపు పొందింది. జగన్ ప్రభుత్వంలో పోర్టు యాజమాన్య బాధ్యతలు నవయుగ నుంచి అదానీకి మారడంతో పరిస్థితి మారిపోయింది. అదానీ స్వార్థం, నాటి మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అక్రమ వసూళ్ల కారణంగా పోర్టు క్రమేణా నిర్వీర్యం అయింది. వ్యాపారం తగ్గిందనే సాకు చూపి అదానీ కంటైనర్ కార్గో నిలిపివేసి, సొంత వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టును డర్టీ కార్గోగా మార్చివేసింది. తమిళనాడులో అదానీకే చెందిన ఎన్నూరు పోర్టులో బొగ్గు, ఐరన్ కార్గో పట్ల అక్కడ తీవ్ర వ్యతిరేకత రావడంతో కృష్ణపట్నం పోర్టుకు మార్చింది. కంటైనర్ కార్గో నిలిపివేతతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పతనం చేసింది. రాయలసీమ గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసింది. వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులను వీధిన పడేసింది. పోర్టు ఆధారంగా ఏర్పడిన పరిశ్రమలను శాశ్వతంగా మూసేలా చేసింది. వైసీపీ అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2019 వరకు ఉజ్వలంగా వెలిగిన కృష్ణపట్నం పోర్టు గత మూడేళ్ల కాలంలో నిర్వీర్యమైంది. పోర్టును నమ్ముకున్న రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు.



నవయుగ నుంచి అదానీకి

కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ రైతుల త్యాగఫలంతో ఏర్పాటైంది. 1996లో పోర్టు స్థాపించారు. 2007 నుంచి కంటైనర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. 2020 మార్చి వరకు ఈ పోర్టు నవయుగ సంస్థ ఆధీనంలో నడిచింది. 2007 నుంచి 2020 వరకు పోర్టులో కంటైనర్ ఆపరేషన్లు అద్భుతంగా నడిచాయి. మొత్తం 14 బెర్తుల్లో 4 బెర్తులు కంటైనర్ కార్గోకు కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానెట్ తదితరాలు ఎగుమతయ్యేవి. పరిశ్రమలకు సంబంధించిన మిషనరీ తదితరాలు విదేశాల నుంచి దిగుమతయ్యేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోర్టుకు గ్రహణం పట్టింది. నవయుగ సంస్థకు ఇబ్బందులు మొదలయ్యాయి. 2020లో పోర్టును అదానీ చేతుల్లో పెట్టకతప్పని పరిస్థితులను నవయుగ సంస్థకు కల్పించారు. ఈ కుట్రలో అప్పటి సీఎం జగన్ హస్తం ఉందనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. 2019కి ముందు రాజకీయాలకు అతీతంగా పోర్టులో వ్యాపార కార్యకలాపాలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పోర్టుపై ఆ పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. కరోనా ప్రభావం తగ్గిన వెంటనే అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కాకాణి గోవర్ధనరెడ్డి కృష్ణపట్నం పోర్టు వ్యవహారాల్లోకి కాలుపెట్టారు. ఒకవైపు కాకాణి వర్గం అక్రమ వసూళ్ల దందా సాగిస్తుండగా, అదే సమయంలో అదానీ ముందస్తు వ్యూహంతో బెర్త్ ఇన్‌చార్జిలు, హ్యాండిలింగ్ చార్జీలు భారీగా పెంచేశారు. భరించలేక పలువురు పెద్ద లైనర్లు కృష్ణపట్నం పోర్టుకు రావడం మానేశారు. కృష్ణపట్నం కంటైనర్ బిజినెస్‌లో మస్క్ వాటానే 50 శాతం. ఆయన రెండేళ్ల క్రితమే కృష్ణపట్నం పోర్టు వదిలి పెట్టేశారు. దీంతో కంటైనర్ బిజినెస్ ఒక్కసారిగా సగానికి పడిపోయింది. అదానీకి చెందిన ఎన్నూరు (తమిళనాడు) పోర్టులో ఆ కంపెనీ ఉత్పత్తులైన బొగ్గు, ఐరన్ ఓర్ కార్గో పట్ల స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బొగ్గు, ఐరన్ ఓర్ తదితర డర్టీ కార్గోను కృష్ణపట్నం మార్చారు. ఇక్కడ వ్యాపారం తగ్గిందనే సాకు చూపి ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గోగా మార్చుకొని, కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గోగా మార్చేశారు. 2024 జనవరి 31 నుంచి పోర్టులో కంటైనర్ కార్గో పూర్తిగా ఆపేశారు. దీంతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానెట్ ధరల పతనం మొదలైంది. ప్రధానంగా నెల్లూరు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సగటున నెలకు 1000 కంటైనర్ల బియ్యం విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఒక్కో కంటైనర్‌లో 25 టన్నుల బియ్యం బస్తాలు చొప్పున నెలకు 25 వేల టన్నుల బియ్యం ఎగుమతి అయ్యేది. పూర్తిగా ఆగిపోవడంతో ఇప్పుడు చెన్నై, ఎన్నూరు పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు రవాణా చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం వరి ధాన్యం ధరలపై పడుతోంది. కంటైనర్ కార్గో ఆగిపోవడంతో పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2-3 వేల కోట్లు నష్టపోతుందన్నది అంచనా.

కాకాణి అవినీతితో ముసలం

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ కార్గో మూతపడటానికి ప్రధాన కారణం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతే అనే వాదన బలంగా వినిపిస్తోంది. 2021కి ముందు పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ప్రధాన పార్టీల నాయకులు పంచుకునేవారు. అధికార పార్టీ నాయకులు 60 శాతం, ప్రతిపక్షనేతలు 40 శాతం పనులు చేసుకునేవారు. కంటైనర్ కార్గో కాంట్రాక్టులను మాత్రం సర్టిఫైడ్ కంపెనీలకే కేటాయించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంటైనర్ కార్గో కార్యకలాపాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో స్థానిక వైసీపీ నాయకులు లారీ అసోసియేషన్ అనే దానిని ఏర్పాటు చేసుకున్నారు. పోర్టులోకి కంటైనర్లను రవాణా చేసే యజమానులను భయపెట్టి అసోసియేషన్‌లో చేర్చుకున్నారు. పోర్టు బయట ఒక టోల్‌గేట్ పెట్టి లారీలను ఆపేయించారు. ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపి లారీ టైర్లలో గాలి తీయించారు. పోలీసులు, ఆర్టీఏ అధికారుల ద్వారా తప్పుడు కేసులు పెట్టించారు. ఈ టోల్‌గేట్‌కి కాకాణి టోల్‌గేట్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. దీంతో విధిలేక ట్రాన్స్‌పోర్టర్లు అందరూ ఈ అసోసియేషన్‌లో చేరారు. తర్వాత దందాలు మొదలయ్యాయి. ప్రతి వాహనం కాకాణి టోల్‌గేట్ వద్ద రూ.2వేలు చెల్లించాలి. అంతేగాక కంపెనీ లేదా డీలర్ ట్రాన్స్‌పోర్టర్‌కు చెల్లించే అద్దెలో 20 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా లారీ అసోసియేషన్ పేరుతో ప్రతి లోడుపై రూ.5-7 వేలు దండుకున్నారు. కమీషన్ల బెడదతో ట్రాన్స్‌పోర్టర్లు, డీలర్లు ఈ పోర్టుకు రాకుండా చెన్నై పోర్టుకు వెళ్లడం ప్రారంభించారు. అయినా వైసీపీ గ్యాంగ్ అరాచకాలు ఆపలేదు. అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేసి వెంకటాచలం హైవే మీదుగా వెళ్లే వారి నుంచి వసూళ్లు చేసింది. దీన్ని కాకాణి టోల్‌గేట్ నంబర్-2గా పిలిచేవారు.

ఎన్నో అనర్థాలు...

కంటైనర్ కార్గో ద్వారా గతంలో 10 వేలమంది ఉద్యోగులు పోర్టులో పనిచేసేవారు. పోర్టులో 600 కంపెనీల కార్యకలాపాలు ఉండేవి. ఇప్పుడు కార్గో మూతపడటంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. ఆరు వేల ఎకరాల్లో విస్తరించిన పోర్టులో ప్రస్తుతం నికరంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులు 300 నుంచి 400 మంది మాత్రమే. బొగ్గు దిగుమతుల కారణంగా కాలుష్యం విస్తరిస్తోంది. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో విషకారకాల వల్ల ప్రజలకు చర్మవాధులు వస్తున్నాయి. బొగ్గురేణువుల కాలుష్యం నెల్లూరు నగరం హరినాథపురం వరకు వస్తోంది. భవిష్యతులో పోర్టు కాలుష్యం నెల్లూరు నగరంతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, కావలి, కందుకూరు డివిజన్ల ప్రాంతాలను సైతం కమ్మేస్తుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

'ఇంటి' దొంగలపై చర్యలేవీ..?



- మంత్రి ఆదేశించినా కదలని హౌసింగ్ ఉన్నతాధికారులు
- విచారణలో తమ పాపాలు కూడా బయటపడతాయనే భయం!
- గత ప్రభుత్వంలో అడుగడుగునా భారీ అవినీతి, అక్రమాలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలు బుట్టదాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో గత జగన్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన పథకం అడుగడుగునా అవినీతిమయమైన సంగతి జగమెరిగిన సత్యం. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ దగ్గరి నుంచి.. మెరక పనుల వరకూ వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారు. మరోవైపు పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లు కూడా రూ.వేల కోట్లు కొట్టేసి పత్తా లేకుండా పోయారు. 'మేం మాత్రం తక్కువ తిన్నామా..!' అన్నట్టు హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బరితెగించి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాల గురించి పత్రికలు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వరుస కథనాలు వెలువడినా జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రజాధనాన్ని లూటీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు మొదలుకొని జిల్లాల్లోని అధికారులు, ఉద్యోగులు, సాధారణ సిబ్బంది వరకూ అందరూ అవినీతికి పాల్పడి పేదలకు తీరని అన్యాయం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో అడ్డూఆపు లేకుండా సాగిన ఈ అవినీతి, అక్రమాలపై నిజాలు నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు ఇచ్చిన నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పోయి.. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అన్ని ప్రభుత్వ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దోపిడీని బయటపెడుతోంది. దీంతో గృహనిర్మాణ శాఖలో జరిగిన భారీ అవినీతి, కుంభకోణాలపై కూడా లోతుగా విచారణ చేసి.. 'ఇంటి' దొంగల భరతం పట్టాలనే డిమాండ్లు అధికమయ్యాయి.

మంత్రి ఆదేశించినా కదలని యంత్రాంగం

గత ప్రభుత్వం ఆప్షన్-3 కింద పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో దాదాపు 3.5 లక్షల మంది ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారుల తరఫున ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అడ్వాన్సులు తీసుకున్నారు. ఆ ఇళ్లకు సంబంధించిన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను కూడా వాడేసుకున్నారు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు లాభదాయకంగా ఉన్న బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే పూర్తిచేసి.. తర్వాత నుంచి పనులు చేయకుండా బిచాణా ఎత్తేశారు. ఈ అంశాలన్నీ ఇటీవల అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి వచ్చాయి. దాంతో మంత్రి సీరియస్‌గా స్పందించారు. కాంట్రాక్టర్లు తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా...? దుర్వినియోగమయ్యాయా..? అనేది పరిశీలన చేసి కచ్చితమైన సమాచారంతో ఈ నెలాఖరుకల్లా నివేదిక ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయకుండా పోయిన కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి.. దోపిడీ చేసిందంతా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ ఉన్నతాధికారులు మాత్రం దీన్ని అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. మంత్రి సమీక్ష ముగిసి 15 రోజులు గడిచినా అధికారులు వేగంగా కదలడం లేదు. ఈ అవినీతి బాగోతంలో భాగస్వాములైన అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడమే దీనికి కారణమని హౌసింగ్ వర్గాలే చెబుతున్నాయి. విచారణ చేపడితే తమ పాపాలు కూడా బయటపడతాయనే భయంతోనే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో ఇష్టారాజ్యం

తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా అందజేస్తానని అధికారంలో ఉండగా జగన్ ఊదరగొట్టారు. కానీ, కేంద్రం వాటా కింద ఇచ్చిన 22 లక్షల ఇళ్లనే మంజూరు చేశారు. వాటిలో కూడా.. ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటిలో ఎక్కువ ఇళ్లు లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో నిర్మించుకున్నవే. ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. అయితే సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని జగన్ గొప్పలు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా ఆప్షన్-3ని ఎంచుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించి.. ఒక్కో ఇంటికి రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. అలాగే ఆ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలును హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందే సరఫరా చేసేశారు. అడ్వాన్సు డబ్బులు, సిమెంటు, స్టీలు ముందుగానే తీసేసుకున్న కాంట్రాక్టర్లు చాలా మంది పునాదులు కూడా పూర్తి చేయకుండానే ముఖం చాటేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి.. దాదాపు 22 లక్షల ఇళ్ల కోసమంటూ 13 రకాల నిర్మాణ సామగ్రిని రాష్ట్ర స్థాయిలోనే కొనుగోలు చేసి.. లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాలవారీగా హౌసింగ్ గోడౌన్లకు బలవంతంగా తరలించారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.1,12,117 విలువైన సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసేశారు. అంటే 22 లక్షల ఇళ్ల కోసమని ఏకంగా దాదాపు రూ.25 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రిని ముందుగానే కొనుగోలు చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉంది. ఈ సామగ్రిని కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవడానికి ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని రూ.వందల కోట్లు మింగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్లలో తుప్పు పట్టిపోతున్న సామగ్రి

నాసిరకం నిర్మాణ సామగ్రిని ఎక్కువ ధరలకు అంటగడుతుండటంతో లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా వాటిని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా సామగ్రి జిల్లాల్లోని గోడౌన్లలోనే అలాగే ఉండిపోయింది. వెంటనే ఆ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చేసినట్టుగా ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేసేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో మే నెలాఖరుకల్లా గోడౌన్లలో ఉన్న మొత్తం స్టాక్‌ను లబ్ధిదారులకు సరఫరా చేసేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో జిల్లాల్లోని ఏఈలు, డీఈలు, ఈఈలు, జిల్లా హెడ్స్ అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయిపోయి.. పది రోజుల్లోనే ఏకంగా 5,11,629 పరికరాలను లబ్ధిదారులకు ఇచ్చేసినట్టుగా ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు నమోదు చేసేశారు. దాదాపు 90 శాతం వరకు లబ్ధిదారులకు ఇచ్చేసినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేసేశారు. ఈ మెటీరియల్స్ విలువ రూ.154 కోట్ల పైమాటే. ఈ మెటీరియల్ సరఫరాలో నిజాలు నిగ్గు తేలాలంటే లబ్ధిదారులను కలిసి విచారణ చేస్తే మొత్తం అవినీతి బాగోతం బయటపడుతుంది.

కడపల గెడ్డపై తగ్గని నీటి ప్రవాహం

● గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

దబ్బపాడు(ఎల్.ఎన్.పేట): మండలంలో గడచిన మూడు రోజులుగా కురిసిన భారీవర్షాల కారణంగా తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలగెడ్డ రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో దబ్బపాడు, వాడవలస గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలు అత్యవసర వైద్య సేవలకు మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా పట్టణాలకు వెళ్లేందుకు సుమారు 4 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఏటా వర్షాకాలం వచ్చిందంటే సుమారు మూడు నెలలపాటు ఇదే పరిస్థితి నెల కొంటోందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని వారు వేడుకుంటున్నారు.



కడపలగెడ్డపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

ఎద పొలాలకు వరద ముంపు

పోలాకి: వంశధార నదీ ప్రాంత ఎద పొలాల్లో వర్షపు నీరు చేరి ముంపునకు గురయ్యాయి. దీంతో ఎదలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలో వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదుల్లో నీటి ప్రవాహం పెరిగి వంశధార కాలువల ద్వారా పొలాల్లోకి చేరడంతో ఈ పరిస్థితి నెలకొందని నీరు సముద్రంలోకి వెళ్లకుండా పొలాల్లోకి చేరుతోందని రైతులు మజ్జి లక్ష్మీనారాయణ, రెడ్డి, సుధీర్, దాస్, రాంబాబు, త్రినాథమ్మ, రామారావు తదితరులు వాపోయారు. దీర్ఘాశి, చింతమానిపేట, వెదుళ్లవలస, డోల, గొల్లలవలస, సంతలక్ష్మీపురం, మబగాం, వనితమండలం తదిత ప్రాంతాల్లో వరినారు, ఎద పంట వరద ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సుమారు 1200 ఎకరాల్లో వరద ముంపు నకు గురైందని అధికారులు పేర్కొంటున్నారు.



ముంపునకు గురైన ఎద పొలాలు

రహదారి పాడైపోతోంది..



తులగాం ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లే రోడ్డుపై నీరు

ఎల్.ఎన్.పేట: కోవిలాం సమీపంలోని తులగాం ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లే రోడ్డు పాడైపోతోందని, ఇబ్బందులు కలిగిస్తే ధర్నా చేపడతామని తులగాం నిర్వాసిత కాలనీ వాసులు జి.ప్రశాంత్‌కుమార్ తది తరులు తెలి పారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం అలికాం-బత్తిలి రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి కోవిలాం కాలనీలోని ఇళ్లలోకి వెళ్లిందని, దీంతో తహసీల్దార్ రాణి అమ్మాజీ ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పక్క నుంచి గట్టు వేయించారన్నారు. దీనివల్ల కోవిలాం కాలనీకి ఎదురుగా ఉన్న తులగాం ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లే రోడ్డుపైకి నీరు రావడం వల్ల రోడ్డు పాడై కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి రోడ్డు పాడవకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేపడతామని వారు స్పష్టంచేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



గంగాధరపేట గెడ్డ వంతెన రక్షణ గోడ విరిగిపోయిన దృశ్యం

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్డు మార్గంలో గంగాధరపేట గెడ్డ వంతెనపై రక్షణ గోడ పాడై ప్రమాదకరంగా తయారైంది. దీంతో రాత్రిపూట వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పోలవరానికి చెందిన ఓ యువకుడు వాహనంతో ఇక్కడే ప్రమాదానికి గురయ్యాడు. వంతెన పాడవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రిటీష్ కాలం నాటి వంతెన కావడం నిర్వహణ లేక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి

టెక్కలి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని ప్రవచనకర్త బి.దురా ప్రసాద్ అన్నారు. ఆదివారం సీతాపురం ప్రసన్న సీతారామాంజనేయ ఆలయంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవన్నామస్మరణ మనశ్శాంతిని ఇస్తుందన్నారు. కార్యక్ర మంలో మూల తాతయ్య, సనపల కరుణాకర్, బెండి దమయంతమ్మ, సుధాకర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నేటి నుంచి శిక్ష సప్తాహ్

పలాసరూరల్/మందస/హిరమండలం: పాఠశాలల్లో సోమవారం నుంచి 29వ తేదీ వరకు శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పలాస, మందస, హిరమండలం ఎంఈవోలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, కె.రాంబాబు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై శిక్షణ అందిస్తామన్నారు. ఇందులో భాగంగా తొలిరోజు టీఎల్ఎంపై, మంగళవారం నిపుణ్‌భారత్ కార్యక్రమం, బుధవారం క్రీడా కార్యక్రమాలు, గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం స్కిల్, డిజిటల్ ఇంటివేటివ్, శనివారం ఎకో క్లబ్, స్కూల్ న్యూట్రిషన్ ఏర్పాటు, సోమవారం కమ్యూ నిటీ పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలు, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియ జేయడమే ఈ శిక్షణ ఉద్దేశమన్నారు. దీనిని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను వారు కోరారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

నందిగాం: గొల్లూరు పంచాయతీ సొంటినూరులో శనివారం పిడుగుపడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా ఆదివారం పరిశీలించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. దీంతో గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న భగవద్గీతపై అష్టావధానం



అష్టావధానం నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు

పలాసరూరల్: పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని సంస్కృత పండితుడు ఎర్రంశెట్టి ఉమామహేశ్వరరావు భగవ ద్గీతపై అష్టావధానం నిర్వహించారు. భగవద్గీత, ఇతిహాసాలపై పృచ్ఛకులు వేసిన ప్రశ్నలకు అవ .దాని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, జేకి రామారావు, జేకి నాగేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు నాని, రామాజి, వెంకటాజి తదితరులు పాల్గొన్నారు.

వర్షప్రియకు మంత్రి అచ్చెన్న అభినందన

టెక్కలి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న వర్షప్రియకు రాష్ట్ర మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థుల కళలపై ఆసక్తి కనబరిచి అసాధారణ ప్రతిభతో రాష్ట్రానికి పేరు తీసుకు రావాలన్నారు. వర్షప్రియ తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో?

● ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు, విద్యార్థులు



అసంపూర్తిగా మిగిలిన రన్నింగ్ ట్రాక్

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాల మైదానంలో పీఎంశ్రీ పథకం కింద రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తికాకపోవడంపై క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. రూ.5 లక్షలతో రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి ఫిబ్రవరి చివరి వారంలో పనులకు శ్రీకారం చుట్టారు. గ్రౌండ్ లెవల్ మట్టి వేసి వదిలేశారు. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రన్నింగ్ ట్రాక్‌తో పాటు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, హైజంప్, లాంగ్‌జంప్ తదితర క్రీడలకు సంబంధించిన కోర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అంటూ అప్పట్లో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ ఆ తదుపరి కోడ్ ముగిసి రెండు నెలలైనా పనులుచేపట్టక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, క్రీడాకారులు కోరుతున్నారు. దీనిపై ఏఈ కె.గణేష్ వద్ద ప్రస్తావించగా నిధులు లేకపోవడంతో పనులు నిలిపివేశారని, నిధులు విడుదలైన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల సమస్యలపై వినతుల స్వీకరణ

కత్తెరవానిపేట (పోలాకి): నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కత్తెరవాని పేటలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో వైసీపీ నాయకుల అక్రమాల వల్ల పడిన ఇబ్బందులను ప్రజలు వినతుల రూపంలో తెలిపారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులు, కాలువ నిర్మాణాలు, విద్యుత్ స్తంభాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, కత్తెరనాయుడు భైరి భాస్కరరావు, జనసేన, బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత

బెలమర(పోలాకి): బెలమర గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు మడ్డు పురుషోత్తమరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆదివారం మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో అందించారు. రూ.5 లక్షల చెక్కును మృతుడి భార్య మడ్డు రాజేశ్వరికి అందించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి బలగ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. సాయమందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



రాజేశ్వరికి చెక్కు అందిస్తున్న నాగబాబు

మారిన క్రీడా విధానంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న తవిటయ్య

పలాస: మారిన క్రీడావిధానంపై అవగాహన పెంచుకోవాలని టెన్నీకాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.తవిటయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో జోన్-1 వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరులో జరుగు పాఠశాల క్రీడల సమాఖ్య పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం నూతన క్రీడా విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్.పద్మలోచనం, ఎస్.రామారావు, చంద్రశేఖర్ పండా, కార్తికేయ చౌదిరి, కృష్ణ, కె.రామారావు, తిరుమల, దామోదర్ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు సందర్శకుల తాకిడి



వంశధార రిజర్వాయర్ వద్ద పర్యాటకుల సందడి

హిరమండలం: హిరమండలం వంశధార రిజర్వాయర్ ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రిజర్వాయర్ అందాలను తిలకించి సెల్ఫీలు దిగారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతాలతో పాటు వంశధార నది నుంచి నీరు రిజర్వాయర్‌లో చేరుతుండడంతో ఆ దృశ్యాన్ని చూసి ఆనందంగా సేదతీరారు.

మండలాన్ని శ్రీకాకుళం డివిజన్‌కు మార్పించండి

● ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను కోరిన ఎల్ఎన్‌పేట టీడీపీ నేతలు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్ఎన్‌పేట మండలాన్ని టెక్కలి డివిజన్ నుంచి శ్రీకాకుళం డివిజన్‌కు మార్చాలని టీడీపీ మండల నాయకులు కె.కృష్ణమాచారి, వి.గోవిందరావు, ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పి.వెంకటరావు తదితరులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతి పత్రం అందించారు. ఎల్ఎన్‌పేట నుంచి టెక్కలి డివిజన్ కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సదుపాయం లేదని, శ్రీముఖలింగం వెళ్లి అక్కడి నుంచి మరో బస్సులో వెళ్లాలంటే వంశధార నదిని దాటాల్సి ఉందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్ఎన్‌పేట మండలం నుంచి శ్రీకాకుళం 30కిలో మీటర్లు, టెక్కలి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండలానికి పోలీసు స్టేషన్, మండల కేంద్రంలో బ్రాంచ్ లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటికి ఎమ్మె ల్యే స్పందిస్తూ.. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



ఎల్ఎన్‌పేట: ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రమిస్తున్న టీడీపీ మండల నాయకులు

సహారా బాధితులకు న్యాయం చేయాలి

పాతపట్నం: సహారా ఇండియా ఖాతాదారులు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని పలువురు బాధితులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘ నాయకుడు బోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కొరసవాడ షిర్డీసాయి మందిర అభివృద్ధికి ఎమ్మెల్యే గోవిందరావు రూ.10 వేలు నగదును ఆదివారం అందించారు. షిర్డీ సాయిని దర్శించుకున్నారు. ఆయనను పలువురు కమిటీ ప్రతినిధులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఆవేటి వారాలు



చల్లవానిపేటలో ముర్రాటలు పోసేందుకు బారులు తీరిన మహిళలు

జలుమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆషాఢ మాసం పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం ఆవేటి వారాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చల్లవానిపేట, అబ్బాయిపేట, తిమడాం, లింగాలవలస, జలుమూరు, తలతరియా తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి ముర్రాటలు పోసి చల్లదనం చేశారు. పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఏడాది పొడవునా పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

చినవంకలో..

వజ్రపుకొత్తూరు: చినవంక గ్రామంలో ఆదివారం ఆవేటి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వరి సాగుకు సిద్ధమయ్యే సమయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి చల్లదనం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురు పౌర్ణమి నాడు ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు ముర్రా టలు పోసి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.



చినవంకలో అమ్మవార్లకు ప్రసాదాలు తీసుకువెళుతున్న మహిళలు

డోకులపాడులో జనసేన సభ్యత్వ నమోదు

వజ్రపుకొత్తూరు: డోకులపాడులో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు నిర్వహించారు. అధిక సంఖ్యలో వీర మహిళలు, జనసైనికుల పాల్గొని సభ్యత్వాలు స్వీకరించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయినందున ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో శంకర్, గిరిబాబు, పవన్ పాల్గొన్నారు.

తెలంగాణా సీఎంను కలిసిన కృపారాణి

టెక్కలి: తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి ఆమెకు సూచించారు. ఆమెతో పాటు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు ఉన్నారు.

శ్రీముఖలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన

జలుమూరు: సుప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామికి గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామస్థుడు పంచాది రమణారావు తెలిపారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీక రించారు. కార్యక్రమంలో అర్చకులు నూర సింహాచలం, పంచాది నారాయణమూర్తి, వెంకటాచలం, సుబ్బారావు, శివ, శ్రీకృష్ణ పలువురు భక్తులు పాల్గొన్నారు.



శ్రీముఖలింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన దృశ్యం



నరసన్నపేట: నర్సింగరాయుడు పేట వద్ద..



మెళియాపుట్టి: తిడ్డిమి వద్ద..

ఏళ్లు గడుస్తున్నా.. మారని రోడ్లు

జిల్లాలో పలు గ్రామీణ ప్రాంత రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. అసలే అంతంత మాత్రమైన రోడ్లు పైగా వర్షాలు కురిస్తే మరి చెప్పాల్సిన పరిస్థితి లేదు. గడచిన ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణ చేయక పోవడం, కొత్త రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్లన్నీ రాళ్లు తేలి, గోతులమయమై అధ్వానంగా తయారయ్యాయి. ఏ మాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని రహదారుల రూపురేఖలే మారిపోయాయి. దీంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజల్లో ఆశలు రేకెత్తాయి. రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: పారశెల్లి-రెల్లివలస మధ్య అల్లాడ రోడ్డు ఇలా..



పలాసరూరల్: చిత్తడిగా చినంచల గుడ్డిభద్ర రహదారి

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హరిపురం/పలాస: మందస రోడ్ (హరిపురం) బారువ రైల్వే స్టేషన్ల మధ్య మహేంద్రతనయ నది సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. యువకుని వయసు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, నలుపు బనియన్ ధరించి ఉన్నాడని, జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. రైలు ఢీకొని లేదా రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే వెంటనే 9440627567 నంబరుకు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వాండ్రంగి వద్ద ట్రాక్‌పై ఒకరు..

పొందూరు: పొందూరు వాండ్రంగి రైల్వేట్రాక్‌పై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి రైలునుంచి జారిపడి మృతిచెందినట్టు జీఆర్పీ ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ఆచూకీ కోసం 94934 74582 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు..

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల: ఎస్ఎం పురం గ్రామానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట బయటకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎచ్చెర్ల పోలీసులు వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని పొందరవీధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం సాయంత్రం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారం మేరకు ఎస్ఐ హరికృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. వీరి నుంచి 12,500 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆ ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామివారి చిత్ర పటాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని లావేరు గ్రామానికి చెందిన డి.లక్ష్మణరావు, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి లక్ష రూపాయలను విరాళంగా ఆలయ ఈవో చంద్రశేఖర్‌కు అందజేశారు. వారిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వామివారిని విశాఖకు చెందిన ఏఎస్పీ చీఫ్ విజిలెన్స్ అధికారి ప్రసన్నకుమార్ ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. అలాగే ఆదివారం ఒక్కరోజు ఆదిత్యునికి రూ.2,71,837ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.57,300, విరాళాల ద్వారా రూ.73,813, ప్రసాదాల రూపంలో రూ.1,40,724 లభించినట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.


గార: శ్రీకూర్మంలో విజిలెన్స్ ఏఎస్పీకి స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న దృశ్యం

● **గార:** శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆదివారం సాయంత్రం విజిలెన్స్ ఏఎస్పీ ప్రసన్నకుమార్ దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని ఆలయ ఈవో గురునాథ్ వారికి అందచేశారు.

వెంకన్న ఆలయంలో సంగీత పోటీలు


సంగీత పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండల కేంద్రంలోని కేశవరెడ్డి స్కూల్ సమీపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కూర్మనాథ కళాపీఠం, సద్గురు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా విద్యార్థులతో గీతాలాపన పోటీలు నిర్వహించారు. సంగీత విద్వాంసులు కరి కూర్మనాథ్ పేరున విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ ఏవో ఎం.రామకృష్ణ, సంగీత అధ్యాపకురాలు కె.యామినికృష్ణ, ఆలయ ధర్మకర్తలు కుమార్, శరత్‌కుమార్, స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు నేతింటి రాజారావు, విజయనగరం నుంచి పలువురు సంగీత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కుంచాలకూర్మయ్యపేట వద్ద శ్రీచక్రపురంలో గురుపౌర్ణమి పూజలు ఆదివారం జరిగాయి. పీఠాధిపతి తోజేమూర్తుల బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు 1001 శ్రీచక్రాల వద్ద సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

శ్మశాన వాటిక నిర్మాణంపై సమావేశం

ఇచ్ఛాపురం: పట్టణ శివారులో ఉన్న వల్లభరాయ శ్మశాన వాటిక వద్ద గ్యాస్ సంహిత శవ దహన యంత్ర భవన నిర్మాణం ఏర్పాటు చేయడానికి ప్రజాభిప్రాయంతో పాటు మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల అభిప్రాయాలను స్వీకరిస్తున్నట్టు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, పైడిశెట్టి దినేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు అధ్యక్షతన కౌన్సిలర్ల నుంచి అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. కౌన్సిలర్లు అంతా ఆమోదం తెలపడంతో రోటరీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం ఇప్పటికే మున్సిపల్ కౌన్సిల్ సభ్యులంతా ఆమోదించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, వార్డు కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, పల్లంటి మధుమూర్తి, లీలారాణి, సీహెచ్ జగన్, బి.జగన్, ప్రదీప్, నారాయణ బెహరా, కాళ్ల ధర్మారావు, నీలాపు ఢిల్లీ, చాట్ల తిరుపతి, రిటైరియన్స్ దినేష్‌కుమార్, పాక తులసీదాస్, మధు, ప్రదీప్, సురేష్, గోపి, రామారావు, ఎల్‌కే రావు, రామకోటి, నవీన్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

యువకుల ఆర్థికసాయం


మధు కుటుంబానికి నగదు అందిస్తున్న దృశ్యం

బూర్జ: దొంకలపర్త గ్రామంలో తండేల మధు(32) ఇటీవల ఆకస్మికంగా మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామంలోని యువకులు రూ.30 వేలు సేకరించి ఆదివారం మధు కుటుంబానికి ఆ మొత్తాన్ని అందించారు. మధుతో ఉండే అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు


శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో సంతోషిమాత అమ్మవారు


పలాస: షిర్డీసాయి మందిరంలో భక్తులు


శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురం షిర్డీ ఆలయం వద్ద..

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలోని దర్బార్ షిర్డీ ఆలయం, మొండేటివారి వీధిలో షిర్డీ ఆలయం, బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనం మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ-బీ కాలనీలో షిర్డీ సాయి పెద్ద ఆలయం, సంతోషిమాత అమ్మవారికి పూజలు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా షిర్డీ సాయి తదితర ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

– ఆంధ్రజ్యోతి బృందం


గార: బూరవెల్లిలో షిర్డీ సాయి ఆలయంలో..


కంచిలి: మఖరాంపురం షిర్డీ ఆలయంలో..


ఆమదాలవలస: కొర్లకోట శ్యామలమ్మ ఆలయంలో..


టెక్కలి: కె.కొత్తూరు బాబా మందిరంలో..


జి.సిగడాం: ఆనందపురంలో..


బూర్జ: తుడ్డలి షిర్డీసాయి ఆలయంలో..


నందిగాం: షిర్డీసాయి ధ్యానమందిరంలో..


నరసన్నపేట: షిర్డీ సాయి ఆలయంలో..


పాతపట్నం: సాయినాథుని దర్శించుకుంటున్న భక్తులు


హరిపురం: అంబుగాంలో గీతాయజ్ఞం..


హిరమండలం: బ్యారేజి సెంటర్ షిర్డీ ఆలయంలో..


వజ్రపుకొత్తూరు: బాతుపురంలో బాబా చిత్రపటంతో ఊరేగింపు


మందస: సాయి పాదుకల ఊరేగింపు

ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు


అధికారులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార: మండలంలో శివారు భూములకు కూడా ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు అవసరమైన సాగునీరు అందించే చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం సతివాడ వద్ద వంశధార కాలువలో నీరు రావడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులుతో కలిసి ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం సాగునీరు కాలువల్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. అందుకే ఈ ఏడాది ఎటువంటి ఇబ్బంది లేకుండా కాలువల ద్వారా ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండ భాస్కరరావు, జీవీఆర్ మూర్తి, కైబాడి రాజు, కె.ఆదినారాయణ, మైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, చల్ల శ్రీనివాస్, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీ

● ఐఆర్‌సీటీసీ ఆర్ఎం క్రాంతి సావర్కర్

ఆమదాలవలస: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను విశాఖ నుంచి ప్రారంభించినట్టు ఐఆర్‌సీటీసీ ఆర్ఎం క్రాంతి సావర్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలు సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీ ప్రకటించినట్టు తెలిపారు. ఆకర్షణీయమైన థాయిలాండ్ పర్యటన ఐదు రాత్రులు.. ఆరు రోజులు ఉంటుందన్నారు. ఈ పర్యటన సెప్టెంబరు 7వ తేదీన బయలుదేరి 12వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ పర్యటనలో సందర్శించే ప్రదేశాలు పటాయాలో నాంగ్‌నూచ్‌గార్డెన్, అల్కాజర్‌షో కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్‌టూర్, డిన్నర్‌తో రివర్ క్రూజ్ అలాగే బ్యాంకాక్‌లోని గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీరాఛా టైగర్ జూ వంటి ప్రదేశాలు సందర్శించడం జరుగుతుందన్నారు. ఈ ప్రయాణానికి ఎయిర్ ప్యాకేజీ ధరలు ఒకవ్యక్తికి రూ.66,735, డబుల్ ఆక్యుపెన్సీ రూ.57,815, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.57,815 ఉంటుందన్నారు. అలాగే దక్షిణ దివ్య ఆలయ పర్యటన ఐదు రాత్రులు, ఆరు రోజులు ఉంటుందన్నారు. ఈ పర్యటన ఆగస్టు 14 నుంచి 19వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ పర్యటనలో మదురై మీనాక్షి ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి దేవాలయం, ధనుష్కోటి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని పద్మనాభస్వామి ఆలయం వంటి ప్రదేశాలు సందర్శన ఉంటుందన్నారు. ఈ ప్రయాణానికి సింగిల్ రూ.51,400, డబుల్ ఆక్యుపెన్సీ రూ.39,880, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.38,005 ఉంటుందన్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఎకానమీ క్లాస్ విమానం టిక్కెట్లు, ఏసీ హోటల్, వసతి ఐదు బ్రేక్‌ఫాస్ట్‌లు, ఐదు డిన్నర్లు, ప్రయాణ బీమా, టూర్ మేనేజర్ సేవలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 92810 30748, 92814 95847, 95501 66168 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరిసాగులో లైన్ షోయింగ్‌తో మేలు


వరుస క్రమంలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని సేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో రైతులతో వరి సాగులో లైన్ షోయింగ్ పద్ధతిలో వరినాట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్‌టు డిజిల్ అసిస్టెంట్ సురేష్ వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరుస క్రమంలో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి దిగుబడి వస్తుందన్నారు. సేపేనపేట గ్రామంలో గత రెండేళ్ల నుంచి కూడా రైతులతో వరుస క్రమంలో వరినాట్లు వేయిస్తున్నామన్నారు. ఈ విధంగా లైన్ షోయింగ్ విధానంలో వరి సాగు చేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంటకు పురుగులు తెగుళ్లు రాకుండా మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ సంవత్సరం కూడా ఆ గ్రామంలో రైతులు అందరూ లైన్ షోయింగ్ పద్ధతిలో వరిసాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: ఎన్నికలు ముందు యువతకు ఇచ్చిన హామీలో భాగంగానే యువతకు ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కోసారి ఒక్కో పరిశ్రమ యాజమాన్యం తెప్పించి యువకు ఉద్యోగ కల్పన చేపడుతున్నట్టు చెప్పారు. ఉద్యోగ మేళాలో 300 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 44 పురుషులు, 50 మహిళలు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం కేవీఎస్ఎన్ రాజు, సిబ్బంది లక్ష్మీదుర్గ, దీపక్ పాల్గొన్నారు.

జీవ శాస్త్రాన్ని సమగ్రంగా బోధించాలి



మాట్లాడుతున్న ఫోరం జిల్లా నాయకులు

సోంపేట: జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేలా కృషిచేయాలని శ్రీకాకుళం జిల్లా జీవశాస్త్ర జిల్లా ఫోరం అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్ అన్నారు. సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఫోరం ప్రాంతీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, మందస మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడుతూ.. పాఠశాలల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా అదనపు సమాచారంతో విపులంగా బోధించాలన్నారు. సమగ్రమైన అవగాహన విద్యార్థులకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రమోద్‌కుమార్ పాడీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, మురళీ దొళాయి, త్రివిక్రమరావు, చక్రధర్, రవికుమార్, మోహన్‌రావు, ఈశ్వరి, ప్రసాద్‌బాబు, గిరిబాబు, దీనబంధు, గోపాలకృష్ణ, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

లలిత సంగీత సుధానిధి


లలిత సంగీత విభావరిలో అలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: గురుపౌర్ణమి సందర్భంగా బాపూజీ కళామందిరంలో తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం లలిత సంగీత సుధానిధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు బండారు చిట్టిబాబును ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. లలిత సంగీతంలో శ్రీకాకుళానికి బండారు చిట్టిబాబు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చారని, అలాంటి వారిని సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శ్రీకాకుళంలో సంగీత సాహిత్యంలో ఎంతోమంది మంచి పేరు తెస్తున్న కళాకారులు ఉన్నారని, వారందరికీ నా సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. బండారు చిట్టిబాబు లాంటి గురువులు మన శ్రీకాకుళంలో ఉండడం మన గొప్పతనం అన్నారు. ఘంటసాల ఉన్నప్పటి నుంచి బండారు చిటిబాబు ఎన్నో మంచి కార్యక్రమారు చేశారని, గాయకులకు, మృదంగ విన్యాసం చేస్తున్న వారికి చిట్టిబాబు దశాబ్దాలుగా గురువని, ఆయన సత్కరించుకోవడం ఆనందదాయకమని అన్నారు. మండా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగీ సాహిత్యానికి బండారు చేసిన కృషికి లలిత సంగీత సుధానిది అనే బిరుదు నుంచి సత్కరించుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, కల్యాణం రామ్మోహనరావు, రెడ్డి సత్యనారాయణ, తమ్మ సాయి ప్రశాంతి, డాక్టర్ మాలతి కోదాడ మౌనిక, డాక్టర్ సంపత్ కుమార్, మావుడూరు సత్యనారాయణ తదితరులు బండారు చిట్టిబాబు స్వరకల్పనలో ఆలపించిన లలిత సంగీత గీతాలను ఆలపించారు.

తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం: ధనరాజ తులసమ్మ అమ్మవారి సంబరాన్ని పట్టణంలో గల పలు వీధుల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మట్టి బిందెలతో తీసుకెళ్లిన పానకాలు, పసుపు నీళ్లతో అమ్మవారిని చల్లదనం చేశారు.

'శిక్షా సప్తాహ్' విజయవంతం చేయండి

కంచిలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం పురష్కరించుకుని సోమవారం నుంచి వారంరోజుల పాటు నిర్వహించే శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను విజయవంతం చేఆయలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

బోనాల ఉత్సవాలకు ఎంపిక


ఎంపికైన సంగీత కళాకారుడు

ఇచ్ఛాపురం: నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యం లో సిరి ఆర్ట్ అకాడమీ వారి నిర్వహణలో హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికలో నిర్వహించనున్న సంగీత కచేరికి పట్టణానికి చెందిన సంగీత కళాకారుడు ఆశి కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు అభినందనలు తెలిపారు. బోనాల ఉత్సవాల్లో సంగీత కచేరి నిర్వహించే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని కళాకారుడు కృష్ణారెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఆమదాలవలస: నెల్లిపర్తి గ్రామంలో సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి అన్ని రకాల వ్యాధులకు అనుభవజ్ఞులైన డాక్టర్లచే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీటితో పాటు స్వామి వారి దివ్య సందేశాన్ని అందించి వృద్ధులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. గ్రామంలో మొక్కలను నాటే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీ గురుప్రసాద్, ఆర్.కిశోర్, పద్మావతి, అచ్యుతరావు మాస్టార్, ఎం.జనార్దనరావు, డాక్టర్ పి.తాతయ్యలు, సీహెచ్ సూర్యారావు, సూర రామచంద్రరావు, పి.నాగేశ్వరరావు, ఎం.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు వేద్దాం

జి.సిగడాం: గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం రణస్థలంలో తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జి.సిగడాం మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణంతో పాటు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, శానిటేషన్ రైతులకు సంబంధించిన పలు సమస్యలు, గృహనిర్మాణ, ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జిపర్తి రఘురాం, మీసాల రవికుమార్, నాయకులు బెవర జగన్నాథరావు, కుదిరిళ్ల బుజ్జి, టంకాల మౌళీశ్వరరావు, కామోదుల సీతారాం, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, కూనుబిల్లి కూర్మారావు, గొల్లాజీ, బోగాది అప్పలనాయుడు, మహదాస్యం చిన్నారావు, పైల రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.